AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in




## లింగంపేటలో భారీవర్షం

లింగంపేట మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం భారీవర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఆహ్లాదకరంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అనంతరం కుండపోత వర్షం పడింది.

– అక్షరటుడే, లింగంపేట





## శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

**అక్షరటుడే, మెండోరా :** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. భారీగా ఇన్‌ఫ్లో వస్తుండడంతో అధికారులు 39 గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్‌లోకి ప్రస్తుతం 3,20,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 39 వరద గేట్ల ద్వారా 2,59,397 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. కాకతీయ కాలువకు 4 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేలు, సరస్వతి కాలువకు 400, లక్ష్మి కాలువకు 150 క్యూసెక్కులు వదులుతున్నారు. మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 616 క్యూసెక్కులు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1085.9 అడుగుల (62.67 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

### నిజాంసాగర్ ప్రాజెక్టులో..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** నిజాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. జలాశయంలోకి ప్రస్తుతం 1,05,694 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో అధికారులు 15 గేట్లు ఎత్తి 69,748 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రధాన కాలువకు 900 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 17.8 టీఎంసీలు కాగా.. 13.9 టీఎంసీల నీరు నిల్వ ఉంది.




## ప్రజాసంక్షేమం కోసమే పథకాల అమలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ పేర్కొన్నారు. నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్హులైన 44 మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ ప్రభుత్వం తీవ్రమైన అప్పుల్లో ఉన్నప్పటికీ పేదలను ఆదుకోవడానికి ఎంతో ప్రయత్నం చేస్తోందన్నారు. కళ్యాణ లక్ష్మి కింద 95 మంది లబ్ధిదారులకు రూ.95,11,020 పంపిణీ చేశామని తెలిపారు. అలాగే షాదీ ముబారక్ పథకం కింద 349 లబ్ధిదారులకు రూ.3,49,40,484 అందించామన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా ఛైర్మన్ కేశ వేణు, గ్రంథాలయ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

## జిల్లాలో 30, 30ఏ యాక్టు అమలు



**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో శాంతిభద్రతల దృష్ట్యా నెలరోజుల పాటు 30, 30ఏ యాక్టు అమలులో ఉంటుందని ఎస్పీ రాజేష్ చంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ యాక్ట్ ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగులు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. ప్రజాధనానికి నష్టం కల్గించే ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు తమకు సహకరించాలని కోరారు.

దసరా పండుగ రావడంతో మార్కెట్ సందడిగా మారింది. ప్రజలు పండుగకు కావాల్సినవి కొనుగోలు చేస్తున్నారు. దీంతో నిజామాబాద్, కామారెడ్డి మార్కెట్లతో పాటు షాపింగ్ మాల్స్, వాహనాల షోరూంలు, ఎలక్ట్రానిక్స్ షోరూంలు కళకళలాడుతున్నాయి. విజయ దశమికి కొత్త వస్తువులు కొంటే మంచిదని ప్రజలు భావిస్తారు. దీంతో సందడి నెలకొంది. ఏ దుకాణం చూసినా ప్రజలతో కిటకిటలాడుతోంది.

- అక్షరటుడే, కామారెడ్డి

నిజామాబాద్ నగరంలో బంతి పూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు





గుమ్మడి కాయల కొనుగోళ్లు..

# దసరా సందడి

▸ జనాలతో కిక్కిరిసిన ఉమ్మడి జిల్లాలోని మార్కెట్లు ▸ జోరుగా వాహనాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోళ్లు

దసరా సందర్భంగా ఉమ్మడి జిల్లాలో మార్కెట్లు పండుగ శోభను సంతరించుకున్నాయి. మార్కెట్లలో బంతిపూలు, గుమ్మడి కాయలతో పాటు ఇతర సామాగ్రి కొనుగోలు చేస్తున్నారు. అంతేకాకుండా షాపింగ్‌మాల్స్ సందడిగా మారాయి. ఇక దసరాకు కొత్త వాహనాలు, గృహోపకరణలు కొనుగోలు చేస్తే మంచిందని ప్రజలు భావిస్తుంటారు. దీంతో ఈ షోరూంలు సైతం కిటకిటలాడుతున్నాయి.

### కలిసొచ్చిన జీఎస్టీ తగ్గింపు

కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ స్లాబ్‌లను తగ్గించిన విషయం తెలిసిందే. దీంతో చాలా వస్తువుల ధరలు తగ్గాయి. కార్లు, బైకులు, ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. కార్లు, బైక్‌ల రేట్లు భారీగా తగ్గడంతో ప్రజలకు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. దాంతో పలు షోరూముల్లో ఇప్పటికే కార్లు బుక్ చేసుకున్నారు. గురువారం విజయదశమి సందర్భంగా కార్లను తీసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

వాహనాల కొనుగోలుపై షోరూం నిర్వాహకులు ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నారు. ఇప్పటికే జీఎస్టీతో ధరలు తగ్గడంతో పాటు ఆఫర్లు ఉండడంతో ప్రజలు ఆయా వస్తువులను ఇళ్లకు తెచ్చుకుంటున్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులైన ఫ్రిడ్జి, వాషింగ్ మిషన్, ఏసీ, ఇతర వస్తువుల ధరలు కూడా తగ్గడంతో ప్రజలు పండుగ పూట కొత్తవి కొనుగోలు చేస్తున్నారు.



షాపింగ్ మాల్‌లో సందడి..

### షాపింగ్ మాల్స్‌లో..

పండుగ సందర్భంగా షాపింగ్ మాల్స్ కిటకిటలాడుతున్నాయి. కొత్త బట్టలు కొనుక్కునేందుకు ప్రజలు అధిక సంఖ్యలో కామారెడ్డి, నిజామాబాద్‌కు తరలి వస్తున్నారు. దీంతో జిల్లా కేంద్రాల్లో భారీగా రద్దీ నెలకొంది. మరోవైపు రేపే దసరా కావడంతో ప్రజలు పూలు, గుమ్మడికాయలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో పూల ధరలు భారీగా పెరిగాయి.



కామారెడ్డిలో కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్న ఎలక్ట్రానిక్ షోరూం

## వివాదాలకు కేంద్ర బిందువుగా సెంట్రల్ జైలు

**అక్షరటుడే, నిజామాబాద్‌సిటీ:** నిజామాబాద్ సెంట్రల్ జైలు వరుస వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. ఇక్కడ పనిచేసిన అధికారుల వ్యవహార శైలి ఇందుకు కారణమవుతోంది. గతంలో పనిచేసిన అధికారులు అక్రమ మొరం తవ్వకాలు జరిపించి రూ. కోట్లు దండుకున్నారనే ఆరోపణలున్నాయి. ఇదే సమయంలో ఖైదీలకు సౌకర్యాలు కల్పించి డబ్బులు తీసుకుంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఇది సరిపోదంటూ తాజాగా ఓ అధికారిపై లైంగిక వేధింపుల ఆరోపణలు రావడం మరోసారి సెంట్రల్ జైలు రచ్చకెక్కినట్లయ్యింది. సెంట్రల్ జైలులో పనిచేస్తున్న ఓ అధికారి అదే డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న ఉద్యోగి పట్ల వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇందుకు సంబంధించిన ఓ పోస్టు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. పలు మీడియాల్లో సైతం కథనాలు వచ్చాయి. దీంతో స్పందించిన జైళ్ల శాఖ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. విచారణ కొనసాగుతుండగానే.. బాధిత ఉద్యోగిని వేధింపు ఆరోపణలు కొట్టిపారేశారు. తనను వేధించారంటూ వచ్చిన ఆరోపణలు అవాస్తవమని ప్రకటించారు. అయినప్పటికీ సదరు అధికారి వ్యవహార శైలిపై పలు ఆరోపణలు రావడం.. గతంలో పనిచేసిన చోట కూడా ఇలాంటి ఘటనలే జరగడంతో అధికారులు విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. కాగా.. జైలులో జరుగుతున్న తంతుపై ఓ యువకుడు జిల్లా జడ్జికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సెలవులు ఉండడంతో దసరా తర్వాత విచారణ చేపట్టనున్నట్లు సమాచారం. ఏదిఏమైనా ఖైదీల్లో సత్ప్రవర్తన తేవాల్సిన జైళ్లలో శాఖలో వరుస వివాదాలు జరగడం చర్చకు దారి తీసింది.



## దుర్గాదేవికి ఎమ్మెల్యే ధన్‌పాల్ పూజలు

**అక్షరటుడే, ఇందూరు:** శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా నగరంలోని పలు మం డపాల వద్ద దుర్గామాతకు ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం పాత కలెక్టరేట్ లోని నవదుర్గాదేవి ఆలయంలో అన్నదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీజీవో అధ్యక్షుడు అలుక కిషన్, కార్యదర్శి అమృత్ కుమార్, బస్వ సాయి, ప్రవీణ్ పాల్గొన్నారు.




## ఇక నుంచి వారానికి ఐదు రోజుల సేవలు

**అక్షరటుడే, నిజామాబాద్‌సిటీ :** రెడ్‌క్రాస్ సంస్థ తలసేమియా బాధితులకు ఊరట కలిగించే వార్త చెప్పింది. నగరంలోని తలసేమియా రక్త మార్పిడి కేంద్రం ఇక నుంచి వారానికి ఐదు రోజులు సేవలు అందిస్తోందని తెలిపింది. తలసేమియా కేంద్రం గతంలో వారానికి మూడు రోజులు మాత్రమే పని చేసేది. అయితే కేంద్రానికి చిన్నారుల సంఖ్య పెరగడంతో వారానికి ఐదు రోజులు సేవలు అందించాలని నిర్ణయించినట్లు రెడ్ క్రాస్ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు కొనసాగుతుందని రెడ్ క్రాస్ జిల్లా ఛైర్మన్ బుస్స ఆంజనేయులు తెలిపారు. ఇతర వివరాల కోసం 08462 222002, 08462314236 నంబర్లలో సంప్రదించాలన్నారు.



## చెరువుకట్టకు మరమ్మతులు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని తిమ్మానగర్ చెరువు కట్టకు అధికారులు మరమ్మతు చర్యలు చేపట్టారు. చెరువు కట్ట తెగిపోయిన ప్రాంతంలో బుధవారం ఇసుక సంచులతో అడ్డుకట్ట వేశారు. చెరువు కట్ట తెగి నీరు వృథాగా పోవడంతో 'అక్షరటుడే'లో రెండు స్టోర్లు కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## 75 వసంతాల 'సంఘ్'టనం..



**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను స్థాపించి గురువారంతో వందేళ్లు పూర్తవుతోంది. ఈ సందర్భంగా సంఘ్ పరివార్ సంస్థలు శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నాయి. సంఘ్ చరిత్రలో ఇందూరు పుటలూ ఉన్నాయి. 1925లో మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ ప్రారంభం కాగా.. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుతున్న ఇందూరు విద్యార్థి రేణుకారావు దేశ్ పాండే 1950లో ఇందూరులో మొదటి శాఖను ప్రారంభించారు. ప్రస్తుత వీక్లీ బజార్ ప్రాంతంలో శాఖను నడిపారు. తొలి శాఖకు 12 మంది విద్యార్థులు హాజరయ్యారని మొదటి తరం



స్వయంసేవక్ కాల్వగడ్డ గంగాధర్ తెలిపారు.

### 1954లో తొలి ప్రచారక్..

ఆర్‌ఎస్‌ఎస్ శాఖ కార్యాన్ని విస్తరించేందుకు ప్రచారక్‌లు కృషి చేస్తారు. అలా 1954లో పుణె నగరానికి చెందిన బాలముకుంద సావరేకర్ ఇందూరుకు తొలి ప్రచారక్‌గా వచ్చారు. ఆయన ఇక్కడే ఉండి సంఘ కార్యాన్ని విస్తరించారు. వీక్లీ బజార్ తర్వాత గాజులపేటలోని సంతాచారి మఠం (దత్త మందిర్) లో మరో శాఖ, ప్రస్తుతం గర్ల్స్ హైస్కూల్‌గా పిలవబడుతున్న కోటగల్లిలోని బాలికల పాఠశాల మైదానంలో శివాజీ శాఖ ప్రారంభమయ్యాయి.

### అన్నిచోట్ల శాఖలు..

ఇలా దినదినాభివృద్ధి చెందుతూ వచ్చిన ఆర్‌ఎస్‌ఎస్.. జిల్లా అంతటా విస్తరించింది. పని విభజన కోసం ఆర్‌ఎస్‌ఎస్ ఇందూరు నగరాన్ని 50 బస్తీలుగా విభజించింది. ఈ 50 బస్తీలలోనూ శాఖలు నడుస్తున్నాయి. ఇందూరు జిల్లాలో 65 ఉప మండలాలు, 70 బస్తీలు ఉన్నాయి. తెలంగాణ ప్రాంతంలో అన్ని ఉప మండలాలు, బస్తీలలో శాఖ నడిచిన మొదటి జిల్లాగా ఇందూరు పేరు సంపాదించింది.

## బీసీ వెల్ఫేర్ అధికారిగా ఎంపికవడం అభినందనీయం



**అక్షరటుడే, కామారెడ్డి :** రామారెడ్డి ఎస్సై లావణ్య గ్రూప్-1 ద్వారా బీసీ వెల్ఫేర్ అధికారిగా ఎంపిక కావడం అభినందనీయమని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఎస్సై లావణ్య ఎస్పీని కలవగా ఆమెను ఎస్పీ సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎస్సై లావణ్య ఎక్సైజ్ కానిస్టేబుల్ నుంచి గ్రూప్ 1లో జిల్లా అధికారిగా నియామకం కావడం గొప్ప విషయమన్నారు. కష్టపడితే ఫలితం వస్తుందనడానికి నిదర్శనమని పేర్కొన్నారు. రామారెడ్డి ఎస్సై లావణ్య 2018లో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారని, 2020లో సివిల్ ఎస్సైగా, 2025లో గ్రూప్-1లో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి పోస్టును సాధించడం ద్వారా అసాధారణ ప్రతిభను చాటుకున్నారని తెలిపారు. సిద్దిపేట జిల్లా చేబర్తి జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రాథమిక విద్యను పూర్తిచేసి ట్రిపుల్ ఐటీ బాసరలో సీటు సాధించి ఆసక్తితో విద్యను అభ్యసించారన్నారు. పోలీస్ ఉద్యోగంలో ఎదురయ్యే సమస్యలు, ఆటుపోట్లు, సమయ పరిమితులను అధిగమిస్తూ, లభించిన ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకొని గ్రూప్-1 ఉద్యోగాన్ని సాధించడం గొప్ప విషయమన్నారు. భవిష్యత్తులో కూడా తన ప్రతిభతో మంచి పేరు సంపాదించి, ప్రజలకు సేవ చేస్తూ తనదైన ముద్ర వేసుకోవాలని ఆకాంక్షించారు.



## వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్:** మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘంలో మంగళవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సొసైటీ సీఈవో సందీప్ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,389 నిర్ణయించిందన్నారు. అలాగే కామన్ గ్రేడ్ ధర రూ.2,369 మద్దతు ధరను నిర్ణయించిందని పేర్కొన్నారు. ప్రాథమిక సహకార సంఘం పరిధిలో ఏర్పాటు చేసిన కేంద్రం వల్ల పెద్ద కొడప్‌గల్, కాసులాబాద్, సీతారాంపల్లి, శాంతాపూర్ గ్రామాల రైతులకు ఉపయోగపడుతుందన్నారు. రైతులు దళారులకు అమ్మి మోసపోవద్దని.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు.



## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

**అక్షరటుడే, బీర్కూర్:** ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని ఐకేపీ ఏపీఎం శిరీష సూచించారు. బీర్కూర్ మండల పరిధిలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బైరాపూర్, కిష్టాపూర్, తిమ్మాపూర్ గ్రామ సంఘాల ఆధ్వర్యంలో కనీస మద్దతు ధరకు రైతుల నుంచి వరి కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీర్కూరు తహశీల్దార్ భుజంగరావు, మండల సమాఖ్య సిబ్బంది, గ్రామ సంఘాల అధ్యక్షులు, గ్రామ సంఘ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో చండీయాగం

**అక్షరటుడే, భీమ్‌గల్:** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కమ్మర్‌పల్లి మండలంలోని చౌట్‌పల్లి ప్రత్యంగిరా కోటిలింగేశ్వర క్షేత్రంలో వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం ఆలయంలో ప్రత్యంగిరా చండీయాగాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌లోని నాచారం గుట్ట లక్ష్మీనృసింహస్వామి క్షేత్ర పీఠాధిపతులు మధుసూదానానంద సరస్వతి స్వామి ఆధ్వర్యంలో యాగం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాలు మానసికంగా ప్రశాంతతను చేకూర్చే కేంద్రాలు అని పేర్కొన్నారు. సనాతన ధర్మం ప్రకృతి ఆరాధించే గొప్ప ధర్మమని చెప్పారు. ఆలయాల్లో చెట్లు విరివిగా నాటాలని ఆయన సూచించారు. కాగా చండీ యాగానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పండితులు భువన గంగాప్రసాద్, వేద పండితులు పాల్గొన్నారు.





నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గోనె రెడ్డి సంఘం ఆధ్వర్యంలో..

## మహిషాసుర మర్ధినిగా అమ్మవారు..


నగరంలోని కసాబ్ గల్లిలో..

శరన్నవరాత్రుల్లో భాగంగా బుధవారం మహర్నవమి సందర్భంగా అమ్మవారికి ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ రోజునే మహిషుడనే రాక్షసుని సంహరించిన అమ్మవారు మహిషాసుర మర్ధినిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి ఈ రోజు ఆకుపచ్చని వస్త్రాన్ని సమర్పిస్తారు. ఆయా దుర్గామాతల మండపాల వద్ద భక్తులు నిష్టతో దుర్గాదేవిని కొలిచారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్


నిజామాబాద్‌లోని పట్టణ ఆర్యవైశ్య సంఘంలో..


ఎల్లారెడ్డి పట్టణంలో..

## పాఠశాలకు డెస్క్ బెంచీల అందజేత



**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని శెట్టిపల్లి గ్రామానికి చెందిన ఉద్యోగులు, విద్యావేత్తలు బుధవారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు డెస్క్‌లు, బల్లలను అందజేశారు. గ్రామానికి చెందిన ఉద్యోగులు, విద్యావేత్తలు పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించడం చాలా అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు. కార్యక్రమంలో శంకర్, సత్యనారాయణ, రాములు, శివ రాములు, బాలయ్య, అశోక్, సురేష్, అట్టెం శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



## కోడ్ కూసినా.. ముసుగు వేయలే..!

**అక్షరటుడే, డిచ్‌పల్లి :** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. కాగా, డిచ్‌పల్లి మండలం ధర్మారం (బి) గ్రామంలో ఎన్నికల కోడ్ అమలు కావడం లేదు. గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహానికి అధికారులు ఇంకా ముసుగు వేయలేదు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలవుతున్నా.. ధర్మారంలో మాత్రం అమలు కావడం లేదని గ్రామస్థులు, ఇతర రాజకీయ పార్టీల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు, గోడ రాతలను తొలగించాలని ఆదేశాలున్నాయి.. అయినా కింది స్థాయి అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

## ఆకట్టుకున్న 'పెద్ద పట్నం'

**అక్షరటుడే, బోధన్:** పట్టణంలోని శక్కర్ నగర్ కాలనీ దేవిగల్లిలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం దేవిమాత వద్ద పెద్ద పట్నం, బోనాల ఊరేగింపు నిర్వహించారు. నిజామాబాద్ జిల్లాకేంద్రానికి చెందిన నాని గౌడ్ బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందూరు మాతంగి మహా బోనం, పెద్దపట్నంలో చేసిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



## బాధిత కుటుంబానికి చేయూత



**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా వంజరి సంఘంలో కీలక బాధ్యతలు నిర్వహించి ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్న ధాత్రిక రవిని జాతీయ బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నవాతే ప్రతాప్ పరామర్శించారు. ఈ మేరకు బుధవారం ధాత్రికి రవి ఇంటికి వెళ్లిన ప్రతాప్ ఆయన కుమారుడికి పుస్తకాలు, ఇతర సామగ్రి అందజేశారు. అనంతరం ప్రతాప్ మాట్లాడుతూ.. ధాత్రిక రవి వంజరి సంఘం అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ప్రస్తుతం ఆయన అనారోగ్యంతో ఉన్నందున జిల్లా వంజరి సంఘం, నగర సంఘం నుంచి ఆర్థికంగా చేయూతనిచ్చే విధంగా కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా నాయకులు గణేష్ యాదవ్, గంగోని వంశీకృష్ణ, గంగాధర్, శ్రావణ్, శ్రీను, రాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## స్థానిక సంస్థల ఎన్నికల నియమావళిని పాటించాలి


**అక్షరటుడే,కమ్మర్‌పల్లి:** స్థానిక సంస్థల ఎన్నికల నియమాళిని అధికారులు సిబ్బంది తూచా తప్పకుండా పాటించాలని ఎంపీడీవో రాజ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ, ఐకేపీ, కంప్యూటర్ ఆపరేటర్లు, ఈజీఎస్ సిబ్బందితో వేర్వేరుగా సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ల ర్యాంప్‌లు, విద్యుత్ తదితర అంశాలపై శ్రద్ధ వహించి ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలనియ ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసాద్ గౌడ్, ఎంపీవో సదాశివ్, ఎంఈవో ఆంధ్రయ్య, వివిధ గ్రామ పంచాయతీల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మద్యం, మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు



**అక్షరటుడే, భీమ్‌గల్:** గాంధీ జయంతి రోజున మద్యం, మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణ పరిధిలో మాంసం దుకాణాలు, వైన్స్‌లు, బార్లు, మాంసాహార హోటళ్లు మూసి ఉంచాలన్నారు. లేని పక్షంలో సంబంధిత యజమానులపై మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

## మల్లికార్జున్ అప్పా షెట్కార్ మృతి తీరని లోటు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** బిచ్కుంద ఏఎంసీ మాజీ ఛైర్మన్ మల్లికార్జున్ అప్పా షెట్కార్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో మల్లికార్జున్ అప్పా షెట్కార్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ.. ఒక నిబద్ధత గల సీనియర్ నాయకుడిని కోల్పోయిందన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## వీధి కుక్క దాడిలో 27 మందికి గాయాలు..

**అక్షరటుడే, ఆర్మూర్:** మామిడిపల్లిలో ఓ వీధి కుక్క స్వైర విహారం చేసింది. మంగళవారం రాత్రి 27 మందిని కరిచింది. ఇందులో చిన్న పిల్లలు తీవ్రంగా గాయపడ్డారు. స్పందించిన కుటుంబీకులు, స్థానికులు వెంటనే వారిని ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఆర్మూర్ పట్టణంలోని కాలనీల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నా మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## రూ.2 వేల కోసం హత్య.. నిందితుడి అరెస్ట్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నగరంలో దారుణం చోటు చేసుకుంది. రూ.రెండు వేల కోసం ఓ వృద్ధుడిని హత్య చేశారు. ఈ ఘటన 25 రోజుల క్రితం జరగ్గా.. పోలీసులు తాజాగా నిందితుడిని అరెస్ట్ చేశారు. నిజామాబాద్ నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 25 రోజుల క్రితం ఓ వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రోడ్డు పక్కన పడుకున్న ఆ వ్యక్తిని నిందితుడు వైర్‌తో ఉరి బిగించి చంపేశాడు. వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించారు. కోటగిరి మండం జైనపూర్‌కు చెందిన హైమద్ రూ.రెండు వేల కోసం ఈ హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. వృద్ధుడిని చంపేసి, అతడి జేబులో ఉన్న రూ.2 వేలు తీసుకొని పారిపోయాడన్నారు. ఈ మేరకు హైమద్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు:ఒకరికి గాయాలు



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** కారును ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ నుంచి నిజామాబాద్ వస్తున్న బస్సు.. ఎయిర్‌పోర్ట్ నుంచి తిరిగివస్తున్న కారును కమ్మర్‌పల్లి గ్రామ శివారులో రైస్‌మిల్ వద్ద ఢీకొట్టింది. ప్రమాదంలో కారులో ఉన్న మెట్‌పల్లి మండల రాజేశ్వర రావు పేటకు చెందిన సాయికి తీవ్రగాయాలు కాగా.. స్థానికులు వెంటనే 108లో ఆస్పత్రికి తరలించారు.

## నిరుపేదలకు దుస్తుల పంపిణీ

**అక్షరటుడే, బీర్కూర్:** దసరా పండుగ సందర్భంగా మున్నూరు కాపు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరుపేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. బుధవారం బీర్కూర్ గ్రామంలోని పోచమ్మ గుడి పదిమంది నిరుపేదలకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కంఠం అంబయ్య మాట్లాడుతూ.. దసరా పండుగ సందర్భంగా పేదలకు సాయం చేయాలనే ఉద్దేశంతో ఉద్యోగులంతా కలిసి వారికి దుస్తులు అందజేశామన్నారు. అనంతరం పోచమ్మ గుడి వద్ద మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి మాల్ దొడ్డి విఠల్, కోశాధికారి కంఠం శ్రీనివాస్, ముఖ్య సహాదారులు మేకల విఠల్, సొసైటీ ఛైర్మన్ ఇంగు రాములు, అవారి గంగారాం, ప్రకాష్, మేకల రాములు, ఇతర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

